**పెళ్ళయిన ముప్పయ్యేళ్ళకు భర్త తనను ప్రేమించలేదన్న భావం ఆమెలో ఆవేశాన్నీ, ఆవేదననీ రగిలించింది. ఆమె ఆరోపణకు భర్తనుంచీ ప్రత్యారోపణ ఎదురయింది. ఏమిటా రహస్యం?**

'నేనొక విషయం అడుగుతాను. నిజం చెప్తారా ?'

అపిల్ పండును ముక్కలుచేస్తున్న మూర్తి సుజాత మాటలకి ఆశ్చర్యంగా తలెత్తి చూసేడు.

వేలూరు సి.యమ్.సి. హాస్పిటల్లో ఆమెను అడ్మిట్ చేసి ఆరు వారాలైంది. సుజాతకు కేన్సరని, అది ముదిరిపోవడంవల్ల ఎక్కువకాలం బ్రతకబోదని డాక్టర్లు తేల్చి చెప్పేశారు.

ఆ విషయం ఆమెకి తెల్సినా ఏమాత్రం దుఃఖపడలేదు. ఎప్పుడూ నవ్వుతూ, జీవితాన్ని ఒక కామెడీగా తీసుకోవడం సుజాత తత్వం.

కాని ఆ రోజు విజిట్ చెయ్యడానికొచ్చిన మూర్తి ఆమెలోని మంచులాటి గంభీరత్వాన్ని చూసి విస్తుపోయేడు. ఇప్పుడు ఆమె అడిగిన ప్రశ్న కూడా అతన్నందుకే చకితుడ్ని చేసింది.

సుజాతెప్పుడూ నిజాలూ, అబద్ధాలు అంటూ నిలదీసినరోజు వాళ్ళ 30 ఏళ్ళ వైవాహిక జీవితంలో లేదు—

"మిమ్మల్నే—"

"ఏంటి ?"

ముందుంచిన పళ్ళ ప్లేట్ని పక్కన పెట్టేస్తూ చిరాగ్గా చూసింది సుజాత—

"నేను మిమ్మల్నో విషయం అడుగుతాను—"

"అడుగు."

"నాకు నిజమైన జవాబు కావాలి."

"నాకు తెల్సినంతవరకూ నిజమే చెప్తాను." నవ్వుతూ జవాబిచ్చేడు మూర్తి—

"చెప్పకుంటే నా మీదొట్టు."

విస్తుపోయి చూసేడీసారి-

"సరే నీమీద వొట్టు."

కొద్దిసేపు మౌనంగా పక్కగా టేబుల్ మీదున్న కేప్సిల్ బాటిల్ని చేతితో అటూ, యిటూ తిప్పి తలెత్తి సూటిగా మూర్తి కళ్ళల్లోకి చూసింది సుజాత.

"మన పెళ్ళయి ఎన్నేళ్ళయింది?"

ఏదో అడుగుతుందనుకున్న మూర్తి ఆ ప్రశ్నకు ఫక్కున నవ్వేడు—

"నవ్వడం కాదు- నా ప్రశ్నకు జవాబియ్యండి"

"నీకు తెల్సు సుజీ."

"మీ నోటి గుండా వినాలనీ"



"30 ఏళ్ళు."

"నేనింక ఏ ఆర్నెల్లో కన్నానో ఎక్కువ బ్రతకను. ఔనా?"

"సుజీ !"

"ఔనా - కాదా ?"

మౌనం వహించాడు మూర్తి—

"మీరు జవాబివ్వకున్నా - దాని అర్థం ఔననే. సరే. అదటుంచండి. చనిపోయేలోగా నాదో కోరికుంది. తీరుస్తారుకదూ?"

"చెప్పు సుజీ" దీనంగా అన్నాడు మూర్తి.

"చూడండి- మన పెళ్ళయింది. పిల్లలు పుట్టేరు. వాళ్ళు పెద్దవాళ్ళయి యెవరి బ్రతుకు వాళ్ళుచక్కగా బ్రతుకుతున్నారు. కాని- ఒక్క మీరు- ఒక్క మీ విషయంలో నన్నొక అనుమానం నిరంతరం బాధిస్తోంది."

తెల్లబోయి చూసేడు మూర్తి.

"నామీద అనుమానమా? దేనికి సుజీ".

విషాదంగా నవ్వింది సుజాత.

"అవును- అనుమానం వుంది. అయితే అది నన్ను మీరు ఏ రకంగానో మోసం చేసేరని మాత్రం కాదు."

"మరెలా?"

"అదేనండీ! ఆ పొడి మాటలమీదే— మన పెళ్ళయిన దగ్గర్నుంచీ చూస్తున్నా- మీరు నాతో యెప్పుడూ మనసారా మాట్లాడ్లేదు! 30 ఏళ్ళు గడిచింది— నేను మీ ఇంటికొచ్చిన మొదటి నుంచి ఈ రోజు వరకూ— నాతో మీరు భార్యతో భర్త మాట్లాడేలా మాట్లాడ్లేదు— ఓ ఆఫీసర్ తన అసిస్టెంట్తో మాట్లాడినట్లు మాట్లాడేరు—"

'చీర బాగుంది' —అంటే-


'ఇది చెయ్యి— అదిచెయ్యి— వో.కె. పోదామా'— అంతే.

'బాబుబావున్నాడు-నీ ముక్కొచ్చింది.' -అంతే—

'కేన్సరా- ఎలాగైతే' -అంతే—

కన్నీళ్ళు ముంచుకురాగా అతన్ని ఇమిటేట్ చేసిన ఆమె భోరుమంది.

"సుజీ" అంటూ మంచం మీదికొచ్చి




టప్పుడు నేను నిశ్శబ్దంగా ఏడ్చేదాన్ని. చివరికి పాపా, బాబూ కూడా 'అమ్మా! నాన్న నువ్వూ ఎందుకెప్పుడూ మాట్లాడు కోరేం!' అంటూ మీముందే ఎన్నిసార్లు అడగ లేదు! అన్నిటికీ చిదానందస్వామిలా నవ్వుతూ కొట్టిపారేయడం! అసలు నేనే

# అన్యమనస్క

## 'వెన్నెల'

కూర్చున్నాడు మూర్తి.

సుజాత మాటలకు అతను సంభ్రమాశ్చర్యాలలో మునిగిపోయాడు.

ముడతలుపడ్డ అతని చెయ్యి ప్రేమగా వెండిలా మెరుస్తున్న ఆమె ముంగురుల్ని స్పృశించింది.

సుజాత అతని చెయ్యిని వెనక్కి తోసేసింది.

"ఇంత చెప్తున్నాను కదా ! కాదు సుజీ! నేను నీతో మాట్లాడేను బాగానే. అనన్నా వాదించరేం? కనీసం నన్నెప్పుడైనా నోరు తెరచి తిట్టేరా చెప్పండి ! అన్నీ చూపుల్తోటే - కోపమైనా, ప్రేమైనా అన్నీ కళ్ళల్లో చూపేవారు ! కాని మాటల్లేని మౌనం కన్నా నోరు తెరిచి తిట్టుకోవడం భరించచ్చండీ—"

"ఆపు - సుజీ - ఆపు."

మూర్తి వారింపుని కొట్టిపారేసింది సుజాత.

"నేనెందుకాపుతానండీ- ఆపను- మీరు నాకుజవాబుచెప్పి తీరాల్సిందే- మీ అమ్మా. నాన్నతో యెంత చనువుగా హాయిగా మాట్లాడేవారు ! ఫ్రెండొస్తే గంటల తరబడీ హస్కు! వాళ్ళ ముందు నేనొచ్చినా మౌనమే— వాళ్ళెళ్ళేక నన్ను చూసినా మౌనమే— అంత పాపం నేనేం చేసేనని ?"

"ప్లీజ్ సుజీ! అలా ఏడ్వకు."

"మిమ్మల్ని కట్టుకున్నాక నేను ఏడ్వని రోజు లేదు! తెల్సా? పైకి దుఃఖం దాచుకొని నవ్వుతున్నట్టు నటించేదాన్ని. రాత్రిళ్ళు మీరు గురకపెట్టి నిద్రపోయే మన్నుకుంటానో పనికొంచెం—కొంచెమన్నా ఆలోచించారా?"

"సారీ సుజీ! అయాం-వెరీ వెరీ సారీ." గాద్గదికంగా అంటూ ఆమెని గుండెల కద్దుకున్నాడు—

"మీ సారీలూ, పూరీలూ నా కక్కర్లేదు -నాకాక్కావాల్సింది సరైన జవాబు, మీరు అందర్తోనూ, అన్నిరకాలుగానూ— అందంగా, ఆనందంగా, సరసంగా, విరసంగా మాట్లాడేవారు— ఒక్క నా దగ్గర మాత్రం క్లుప్తంగా— ఇష్టం లేనట్లు మాట్లాడేవారు! అందుకు కారణం ఏంటి?"

"........ ...."

"దయచేసి మీ మౌనాన్నిక మానండి ! నాకు జవాబు కావాలి. ఇన్నాళ్ళూ ఈ విషయం యెన్నోసార్లు అడగాలని పెదవి

ప్రఖ్యాతి చెందిన!
ఖటావ్ మిల్లు వారి
★100% పాలియస్టర్ చీరలు
★ఫుల్‌వాయిల్, అఫ్‌వాయిల్ చీరలు
★షర్టింగులు, గ్లాసుకో ధోవతులు
★డ్రెస్ మెటీరియల్సు, 2x2 రూబియాలున్ను
★స్కూలుయూనిఫారంలు వగైరాలకు
విజయ షో రూమ్
ప్రత్యేక ఖటావ్ మిలు వస్త్రముల షోరూమ్
J.D. హాస్పటల్ రోడ్డు,
గవర్నరుపేట.........విజయవాడ-2.




దీర్ఘవ్యాధులకు ఉత్తమ వైద్యం
దురభ్యాసములకు లోనై.
దాంపత్యసౌఖ్యం పొందలేనివారికి
హెర్నియా, చర్మవ్యాధులకు
పొట్టుద్వారా వరిబీజం(బుడ్డ)
ఇస్నోఫిలియా ఉబ్బసం (దమ్ము)
జీర్ణాశయ(గ్యాస్ట్రిక్) మూత్ర, స్త్రీల
వ్యాధులకు ఆపరేషన్ లేకుండా
చికిత్స చేయబడును. -రండి
డా॥ దేవర
5/1 బ్రాడీపేట, గుంటూరు. A.P.

చివరిదాకా వొచ్చి ఆగిపోయేది. మీకు యిష్టం లేకపోతే నాకేమని వెర్రిగా నేనే యేదో వాగుకునేదాన్ని. నాకు తెల్సు! మీరెవర్నో అమ్మాయిల్ని పెళ్ళిగాకముందు ప్రేమించి వుంటారు."

"కాదు సుజీ."

"బుకాయించకండి! పెళ్ళి పీటల మీద నన్ను తాకకూడనట్టు కూర్చున్నప్పుడే తెల్సు నాకు! ఐనా నేనప్పుడు జీవితాన్ని సీరియస్‌గా తీసుకోలేదు. ఎలా జరిగితే అలా కానీ అనుకుని తేలిగ్గా తీసుకున్నా—కాని— యిన్నేళ్ళయింది— మీకూ, నాకూ మధ్య 30 ఏళ్ళ బంధం వుంది. కాదనుకున్నా మీపై నాకు అధికారముంది. వొద్దనుకున్నా మీరంటే కొండంత అభిమానముంది. మిమ్మల్నొదిలి నేను యేదో లోకాలకు వెళ్ళిపోవడం నాకిష్టంలేదు—"

"సుజీ—"

మూర్తి కళ్ళు చెమర్చాయి—

"నిజమండీ! మృత్యువంటే భయం లేదు- మిమ్మల్నొదిలిపోవాలనే! మీరెంత మౌనంగావున్నా, నాతో యెంతక్లుప్తంగా మాట్లాడినా - నాకు తెలీకుండానేమిమ్మల్ని నేను ఆరాధించేను - నా సర్వస్వం మీరే - నాకు ఈ వొక్క ప్రశ్నకు జవాబుచెప్పండీ! ఆ అమ్మాయెవరూ? ఇన్నేళ్ళయినా ఆమె స్థానాన్ని మీలో భద్రంగా నిలబెట్టుకుని నన్ను మీకు దూరంగా నెట్టేసిన ఆవిడెవరో చెప్పండి - కనీసం - నా గురించి మీరే మనుకుంటున్నారో చెప్పండి! వినేసి చచ్చిపోతాను! నాకు మీరు నన్నిష్టపడకున్నా ఫర్వాలేదు- మీ అంతరంగం తెలియాలి. తెలియకుండా, తెల్సుకోకుండా మాత్రం నేను చచ్చిపోను- పోలేను-"

వగరుస్తూ అంటున్న సుజాతను బలవంతంగా పడుకోబెట్టేడు. టవల్ తీసుకొచ్చి కళ్ళను శుభ్రంగా తుడిచేడు—

"మాట్లాడండీ?"

గట్టిగా అతని చెయ్యి పట్టుకుంది సుజాత.

మూర్తి కళ్ళల్లో ఆమె అంతవరకూ ఏ రోజూ చూడని ఒక చిత్రమైన మెరుపు కన్పించడంతో ఆశ్చర్యపోయింది.

"ఎందుకట్లా చూస్తున్నారు?"

"ఆవేశపడకు సుజీ- నువ్వనుకున్నది సగం నిజం— సగం అబద్ధం—"

"అంటే— సరిగ్గా చెప్పండి."

"ఇప్పటికే చాలా అలసిపోయ్యావు—రేపొచ్చి సావకాశంగా చెప్తాను- ఈ రోజుకిక పడుకుని నిద్రపో."

"ఊహూ - ఈ రోజే."

"ప్లీజ్! రెస్ట్ తీసుకో."

గొంతువరకూ దుప్పటి కప్పి వీడ్కోలుగా ఆమె వైపు చూసేడు.

"అదిగో - మళ్ళీ దాస్తున్నారు."

"రేపటి వరకేగా."

"అవున్లెండి! ఇన్ని రోజులు వూరుకున్నదాన్ని- ఇంకొక్కరోజు ఆగలేనా?"

మగతగా కళ్ళు మూసుకుందామె.

మూర్తి తలుపులు చేరవేసి నవ్వుకుంటూ బయటికి నడిచాడు.

## 2

మరునటి రోజు సుజాత మూర్తికోసం వొళ్ళంతా కళ్ళు చేసుకుని ఎదురు చూస్తోంది.

సాయంత్రం దాకా చూసినా అతను రాలేదు.

ఆత్రుత పట్టలేకపోతోంది—

ఇంతలో గది తలుపులు తెరుచుకుని తెల్లగులాబీలాటి స్పెషల్ వార్డ్ నర్స్ చిరునవ్వుతో లోపలికి ప్రవేశించింది.

"గుడీవినింగ్ సుజాతమ్మగారూ! మీకోసం మీ వారొచ్చి ఈ బుట్టనిచ్చి వెళ్ళేరు."

పళ్ళు, మందులుంచిన బుట్టనందుకుంటూ లోపలేదోగొణుక్కుంది సుజాత-

నర్స్ ఏమిటన్నట్టు చూసింది—

"ఆయనెందుకు రాలేదు?"

"మళ్ళీ వొస్తానని చెప్పమన్నారు."

పల్స్ చూసి చార్ట్‌లో యేదో రాసుకుంటోంది నర్స్.

"మళ్ళీ అంటే యెప్పుడు? ఈ రోజు వొస్తానని చెప్పి...."

గట్టిగానే గొణిగిన సుజాతను చూసి నవ్వింది నర్సు.

మందులన్నీ వరసగా మింగించి-

"రాత్రి మేలుకోకండి! యేం?" అని వెళ్ళిపోయింది.

కోపంగా మూర్తి పంపిన బుట్టకేసి చూసింది సుజాత. అందులోంచి నీలం రంగు కవరొకటి ఆమె నాహ్వానిస్తున్నట్టు పైకి తొంగి చూస్తోంది.

సర్రున లాగి కొసలని చింపింది—

"సుజీ డియర్!

నాకోసం యెదురుచూస్తున్నావు కదూ? సారీ. ఈ రోజు రాలేకపోతున్నా. టెలిగ్రామ్ వొచ్చింది వూర్నించి! అక్కడ హోటల్లో యేదో గొడవ జరిగిందట! నీకు చెప్పే వెళ్ళాలనుకున్నా. నిన్న నువ్వడిగిన ప్రశ్న అందుకు అడ్డొచ్చింది —ఎందుకో తెల్సా? చెప్తా విను!

నిన్న నువ్వన్నావు- నీతో ఈ ముప్పై యేళ్ళూ క్లుప్తంగా, అతి తక్కువగా మాట్లాడేనని. ఆ సంగతి నాకు నిజంగా యిన్ని రోజులూ తెలీదు. గతాన్ని పరిశీలించి, ఆలోచించి చూస్తే నువ్వన్నది నిజమే

నన్పించింది. కాబట్టి ఆ విషయం చెప్పు కుంటున్నా. ఐతే అందుకు కారణం— మవ్వను కున్నవికాదు. నేను రాయబోతు న్నవి. ఏ నాటికీ నీతో చెప్తాననుకోలేదు. కాని నీకు నా మీద నిజంగా ప్రేముందని విన్న నీ మాటలద్వారా తెలిసేక అన్నీ చెప్పేయాలన్పిస్తోంది.

30 ఏళ్ళ వెనక నేను డెహ్రాడూన్‌లో వున్నప్పుడు మా నాన్నగారు (మీ మామయ్యలే) నాకు పెళ్ళి సంబంధం చూసే నంటూ నీ ఫొటో వొకటి పంపేరు. నమ్మతావా చెప్తే? నేను నీ ఫొటోని ఫస్ట్ సైట్‌లోనే ప్రేమించేను. నీ గురించి అందమైన కలలు కన్నాను. మా నాన్న గారికి నిన్ను రియల్‌గా చూడకనే నచ్చిం దంటూ లెటర్ రాసేను. పెళ్ళి నిశ్చయమై నప్పుడు కూడా నే నక్కడలేను (నీకు తెల్సా?)

పెళ్ళికి ముందురోజే నేను మీ వూరొ చ్చేను. నాకప్పుడు వొక చిత్రమైన ఆలో చన కల్గింది.

పెళ్ళి పొద్దున నాలుగింటికి. నేను వొచ్చింది మధ్యాహ్నం మూడింటికి.

ఎలాగన్నా— వొక్కసారి— ఆ మధ్య— పెళ్ళిముందే నిన్ను చూడాలి, మాట్లాడాలి అనుకున్నా.

అనుకున్నది చేసెయ్యడం కుర్రతనం కదూ?

అందుకే ఆ రాత్రి భోజనాలయ్యాక నేను చిట్టీ అనే కుర్రాడిని మీ విడిదికి పంపేను. ఎన్నో జాగ్రత్తలు చెప్పేను వాడికి. అయితే ఏమైందో తెల్సా? ఉహూ నీకు తెలీదు! మండపం వెనక- మెట్లమీద నిల్చుని నీ కోసం ఎదురు చూస్తున్న నాకు చీర రెపరెప విన్పించడంతో:

"సుజాతా!" అంటూ ఆశగా మెట్లు దిగాను.

ఎదురుగా మీ పరిమళ వదిన.

"ఏం బాబూ! పిల్చావుట" అందావిడ నవ్వుతూ.

"మిమ్మల్ని కాదండీ. సుజాతని" సిగ్గు పడ్తూ జవాబిచ్చేను.

"ఆమె నిద్రపోతోందే!"

మీ వదినగారు యెందుకో భయపడ్తు న్నట్టు అన్నారు.

నా కది సహజమే అన్పించింది.

కొందరు పెద్దవాళ్ళకు ఇలాంటి కల [illegible]కలు గిట్టవు.

"[illegible]! ఒక్కసారి లేపరూ?"

[illegible]పడ్తూ ఆవిడ్ని వేడుకున్నాను.

"లాభంలేదే! తనొకసారి పడుకుం దంటే ఇక దేవుడొచ్చినా లేవదే!"





కోట్లాది ప్రజలకు ప్రీతిపాత్రమైన
అత్యంత విలువైన పుస్తకములు

1. టైలరింగ్ & కటింగ్ గైడ్ రు. 15/-
2. కోకశాస్త్ర (112 ఫొటోలు) " 15/-
3. 68 పడకగది ఫొటోలు " 15/-
4. ఫొటోగ్రఫీ " 15/-
5. కామసూత్ర " 15/-
6. ప్రైవేట్ ఫొటో ఆల్బమ్ " 30/-
7. డ్రాయింగ్ & పెయింటింగ్ " 15/-
8. దాంపత్య జీవితం " 15/-
9. రేడియో&ట్రాన్సిస్టర్ గైడ్ " 20/-

పోస్టేజి అదనం.

STAR BOOK DEPOT (AJW)
Chhapeti, Aligarh.

ఉచితం ఉచితం ఉచితం

తెల్ల మచ్చలు

ఏ రకం తెల్లమచ్చలైనాసరే వాని రంగు మరియు ఎర్రమచ్చలరంగు మా ప్రఖ్యాత ఔషధం "డాగ్ వినాశక్" వాడిన మొదల మూడు దినములలో మారును. అటుపైన మామూలు చర్మంవలె నుండిపోవును. ప్రచారం కొరకు ఒక సీసా మందు ఉచితంగా పంపెదము. వెంటనే వ్రాయండి.

Address

Mysore Chikitsalaya (T.O.)
P. o. Katri Sarai (Gaya)

అందరినీ అలరించే
"జ్యోతిచిత్ర"
చదివి ఆనందించండి!

డా॥ పి. వి. కె. రావ్, B. A.,
వైద్యవిద్వాన్, వైద్యాచార్య, సెక్స్ స్పెషలిస్ట్



వివాహము వాయిదా వేయనవసరంలేదు. హస్త ప్రయోగం, నరముల బలహీనత, శీఘ్ర స్ఖలనములకు ఆయుర్వేద చికిత్స పోస్టు ద్వారా చికిత్స కలదు.

రావూస్ క్లినిక్,
టి. బి. రోడ్, తెనాలి, ఫోన్ : 700. 1010

"పోనీ, ఎక్కడో చెప్పండి! నేనే వస్తాను."

"బాబోయ్! అక్కడ మా తోడికోడళ్లున్నారు. చూశారంటే ఇంకేమన్నా వుందా? అయినా పొద్దున్నే ఎలాగూ చూడబోతున్నావుగా! తొందరెందుకు మూర్తీ! పెద్దవాళ్ళు చూస్తే బాగుండదు. నే చెప్తాగా సుజీకి "కొంటెగా నవ్వి మీ వదిన అక్కడ్నుంచి వెళ్ళిపోయింది.

నాకుమాత్రం ఎంతో నిరాశైపోయింది చూడాలి అనుకున్నా, చూడలేకపోయేనని.

అసలు పొద్దున పెళ్ళికాబోతూ నువ్వెలా నిద్రపోతున్నావా అని ఆశ్చర్యపోయేను.

నేను మళ్ళీ కాళ్ళిడ్చుకుంటూ మా విడిది చేరేసరికి అక్కడ నా ఫ్రెండ్సంతా పేకాడ్తూ నా మీద జోక్స్ వేసుకుంటున్నారు. నేను దిగులుగా వుండడం చూసి నా డియరెస్ట్ ఫ్రెండ్ రాఘవ్ నన్ను బలవంతంగా రోడ్డుమీదికి తీసుకెళ్ళేడు. ఇష్టమొచ్చినంత సేపు వూరంతా బలాదూర్ తిరిగేం.

చివరికి మీరా థియేటర్ (గుర్తొస్తోంది కదూ!)లోకి వూరికే వెళ్ళేం. సరదాకు టికెట్లుకొన్నాం. కాసేపు యన్జాయ్ చేద్దామని లోపలికెళ్ళి కూర్చున్నాం.

సినిమా స్టార్టయింది—

"సుజీ! నువ్వు చేసిన పని యేమన్నా బాగుందా?"

ముందు సీట్లోంచి ఒక మగ గొంతు విన్పించడంతో నేను వులిక్కిపడ్డాను.

"సుజీ"- అన్నమాట యెక్కడ విన్నా నాకు చెవుల్లో అమృతం పోసినట్టు తియ్యగా వుంటుంది - నీ ఫొటో చూసిన రోజు నుంచీ. అందుకే కాజ్యువల్‌గా ఆ "సుజీ" యేమంటుందోనని ఆసక్తిగా ముందుకు వంగేను.

"ఏం చేసేను" నిర్లక్ష్యంగా విన్పించింది ఆ పూర్ వుమన్ సుజీ గొంతు.

"పొద్దునే పెళ్ళి కాబోతూ- ఇలా రావటం- నాతో మాట్లాడాలని కబురు చెయ్యటం- ఏమన్నా బాగుందా?"

నా పక్కన బాంబ్‌షెల్ పడ్డట్టు లేచి కూర్చున్నాను. సందేహం లేదు. ఆ 'సుజీ' నాక్కాబోయే సుజాతేనని నాకు తెల్సిపోయింది.

మీ పరిమళ వొదినగారు సుజాత నిద్రపోయిందని యెందుకు భయపడ్తూ చెప్పేరో నాకర్థమైంది అప్పుడు.

నా మిత్రుడు రాఘవ్ కూడా ఆ ముందు వాళ్ళ మాటలు విన్నాడు. [ఇంకా డొంక తిరుగుడెందుకుగానీ- నువ్వూ, కిషన్ అనే అబ్బాయి ఆరాత్రి నాముందే ఆ సినిమా హాల్లో కల్సుకున్నారు. ఇవన్నీ నీకు తెలీదని కాదు— నాకు తెల్సని నీకు తెలీదని రాస్తున్నాను.]

"సుజీ! అయాం వెరీసారీ! నేను క్షంతవ్యుణ్ణి కానని తెల్సు— ఐనా చెప్తున్నా- ఇది నీ మంచికే చేసేను. నన్ను పెళ్ళిచేసుకుంటే నీకేం దొరకదు! ఒక్క నా నిరుద్యోగం తప్ప! ఏమీ లేనివాడ్ని! ఇంతకన్నా యేం చెప్పగలను? నన్ను మరచిపోయి అతనితో హాయిగా బ్రతుకు! నాకంతే చాలు" అని కిషన్ అనడం, నువ్వు గట్టిగా కసురుకోవడం తెల్సునాకు.

"చాల్లే! ప్రేమించేనని కబుర్లు చెప్పినపుడు ఈ జ్ఞానం లేదూ? అప్పుడు నిరుద్యోగం లేదూ?"

"ఉంది సుజీ! ప్రేమకు నిరుద్యోగం అడ్డురాలేదు - పెళ్ళికి వొస్తుంది! ఇద్దరం కల్సి బ్రతకాలంటే డబ్బుండాలి: అది లేకపోయినా ప్రేమ నిలుస్తుందికాని, పెళ్ళి నిలవదు."

"నీదంతా చాదస్తం."

"అలాగనుకుని నన్ను మర్చిపో- ప్లీజ్ గతాన్ని వదిలేసి రేపు కాబోయే అతన్ని సుఖపెట్టు సుజీ! నేనింకేం కోరుకోను."

"హుఁ! సుఖం నా చేతుల్లో వుందా? ఉంటే నేను కావాలనుకున్నది నేను పొందేదాన్ని."

"ఎం కావాలి నీకు?"

"నువ్వు."

నా గుండె ఆగిపోతుందేమోనని భయమేసింది నువ్వా మాట ఆ కిషన్‌తో అంటుంటే.

రాఘవ్ నన్ను 'బయటికెళ్దాం రా' అన్నాడు కోపంగా.

పూర్తిగా వినాలని నేనే ఆగమన్నాను—

"మళ్ళీ మొదటికి రాకు సుజీ! అంతా చెప్పేనుగా. నువ్వింకెళ్ళిపో! మీ ఫ్రెండ్సక్కడున్నారుగా! వాళ్ళెవర్తో నన్నా నోరు జారితే ప్రమాదం."

"జారే వాళ్ళక్కడెవరూ లేర్లే. సమయం చూసి జారుకునే రకం నువ్వు."

"సుజీ!"

"నన్ను ప్రేమించేవుకదూ?"

"ఔను."

"నే నెవర్నో పెళ్ళి చేసుకుంటుంటే బాధగా లేదూ?"

"లేదు!!"

"ఏం?"

"నాకు డబ్బులేదు. అతనికుంది. అతన్తో నువ్వు సుఖపడ్తావనీ."

"కానీ కిషన్! నాక్కావాల్సింది డబ్బు

కాదు! నువ్వు. నీ ప్రేమ! ఇవుంటే నేను డబ్బు లేకున్నా బ్రతగ్గలను."

"పిచ్చి పిల్లవి."

"నవ్వేకలా! నిజంగా నీకు ప్రేమంటూ వుంటే ఇది చివరిక్షణం. నువ్వెక్కడికి పిల్చినా నేనొచ్చేస్తాను. డిసీజ్ నాట్ టూ లేట్ - ప్లీజ్! నీ నిశ్చయం మార్చుకోవా?"

"సుజీ! సుజీ! నామాట వినమ్మా! ప్రపంచంలో ప్రేమ తిని బ్రతకడం కష్టం. ఊహల్లో బ్రతకొచ్చు. నిజంగా కష్టం! ఆ కష్టాల్ని నీకు రాసీయడం నాకిష్టం లేదు—"

నేను వెనక సీట్లో నిన్ను పొందలేనని యెంత విలవిల లాడానో ముందుసీట్లో తిరస్కార బాధతో నువ్వలాగే విలవిల లాడ్డం నేను కళ్ళారా చూసేను.

చివరికి నువ్వు గట్టిగా అరిచేవు—

"నువ్వొట్టి దౌర్భాగ్యుడివి! పిరికి వాడివి! నీ లాంటి పిరికివాడ్ని నేనెలా ప్రేమించానో నాకే తెలీడం లేదు.

ఓకే సార్. మీరన్నట్టే మిమల్నిక్షణం నుండీ కంప్లీట్‌గా మర్చిపోతాను. మీ జోలికిక రాను. గుడ్‌బై "అంటూ కమ్ముతున్న కన్నీళ్ళని తుడుచుకుంటూ నువ్వు మాముందు సీట్ వొదిలి మరో ప్రక్కనున్న లేడీస్ గ్రూప్‌లో కల్సిపోయేవు.

నేను కరెంట్ షాక్ తిన్నవాడిలా సీట్లో పడిపోవడం చూసి రాఘవ్ నన్ను అక్కడ్నుంచీ లేవగొట్టేడు.

మేమిద్దరం మెల్లిగా టాకీస్ కేంటిన్ లోకి నడిచి టీ తాగేం తేరుకునేందుకు—

"నువ్వు చెప్తావా? నేను చెప్పనా?"

రాఘవ్ రౌద్రంగా చూస్తూ అన్నాడు.

నా కర్థంకాలా.

"ఏమిటి?"

"మీ నాన్నగారికి! ఈ పెళ్ళి జరిగేందుకు వీల్లేదని."

అతని కటుత్వం నాకు నచ్చలేదు, అది పబబే అయినా. నేను నిన్ను ఫొటో చూసి ప్రేమించాను. నువ్వు నాలాగే మరో మనిషిని ప్రేమించడం తప్పు కాదు.

ప్రేమ ముందు నువ్వు చూపేధైర్యం. నిస్సంకోచం నన్నాకట్టుకున్నాయి.

అయితే అవి నాకోసం కాదు. మరో మనిషి కోసం.

నాకు చెప్పుకోలేనంత ఈర్ష్య పుట్టుకొచ్చి ఆ కాంటీన్‌లోని టీ కప్పుని చెయి జార్చి డబుల్ రేట్ చెల్లించానారాత్రి.

అప్పుడు నాలో రెండు ప్రశ్నలు మెదిలేయి—

నువ్వూ. నేనూనా?

కిషనూ నువ్వూ నాని.




అన్ని రకముల వంట పనులకు
JOHNSON
కుకింగ్ రేంజి
సోనో విజన్,
ఏలూరురోడ్డు, విజయవాడ-2.

ఋణం
వ్యాపారాభివృద్ధి కోసం ఆకర్షణీయమైన షరతులమీద భవనం, వ్యాపారం, షాపులు, భూములు, థియేటర్లు, లిమిటెడ్ కంపెనీలు, పరిశ్రమలు వగైరాలపై రు. 20,000 లేక ఆపైన ఋణం లభించును.
వ్రాయండి లేదా సంప్రదించండి. ఫోన్ : 395126
SUPREME CORPORATION (BANKERS)
F-15, "EVEREST" 7th Floor, Near Famous cine laboratory, Tardeo Road, BOMBAY-400 034.
ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులో.

మహిళ ప్రత్యేక నేస్తం!


MFGRS: R. శంకర్‌దాస్ & కంపెని,
37 చకలా స్ట్రీట్, బొంబాయి 400 003 • ఫోన్: 327513
అన్ని ప్రముఖ స్టోరులలో లభ్యం



నీ మీద ప్రేమ నిన్ను త్యాగం చెయ్య లేనంది మొదట— కాని నేను నిన్ను పెళ్ళి చేసుకొని యేం లాభం? నీ మనసు యెవర్దో ఐనప్పుడు?

కిషన్ + నువ్వు ఐతే ఇద్దరికి ద్దరూ వుంటారు.

"రాఘవ్! నువ్వెళ్ళి వొకసారి అర్జెంట్‌గా ఆ కిషన్‌ని వెంటబెట్టుకునిరా."

"నీకు పిచ్చెక్కలేదు కదా?"

"ప్లీజ్! వెళ్ళు! తొందరగా."

రాఘవ్‌కి మంటగా వున్నా మాట తోసెయ్యలేక వెళ్ళి అతన్ని పిల్చుకొచ్చేడు-

"నా పేరు మూర్తి. సుజాతకి నిశ్చయం అయిన భర్తని" నన్ను నేను యింట్రడ్యూస్ చేసుకున్నా.

కిషన్ నోరెళ్ళబెట్టాడు.

"మీ ఇద్దరి కథా నాకు తెల్సు. మీరు నా గురించి విడిపోనక్కర్లేదు. పొద్దున్నే నాతో బదులుగా సుజాత పెళ్ళి మీతో జరిపిస్తాను. మీకు జాబ్ ఇప్పిస్తాను...."

రాఘవ్ నాకేసి వెర్రిగా చూస్తూంటే కిషన్ నేనేదో దయ్యమన్నట్టు చూసేడు-

"థాంక్స్ మూర్తిగారూ! సహృదయంతో మీరా మాటన్నారుగానీ అది జరిగే పని కాదు."

"ఏం?"

(1) మావాళ్ళే పెళ్ళికి వొప్పుకోరు.

(2) నా వెనకాల అయిదుగురాడపిల్లలున్నారు. వాళ్ళనొదిలి నేను చేసుకోవడం బాగుండదు.

(3) మా నాన్న గుడ్డివాడు.

(4) మా అన్నయ్య ఫేక్టరీలో మొన్నటికి మొన్న కాలు విరగ్గొట్టుకున్నాడు. వాళ్ళ నందర్నీ వొదిలి సుజాతని చేసుకోలేను. అలాగని సుజాతని ఆ నరకంలోకి తీసుకురాలేను. ఆమె నాతో కన్నా మీ తోనే యెక్కువ సుఖపడ్తుంది.

కిషన్ అవేగాక వాళ్ళ కుటుంబ సమస్యల గురించి ఇంకా 190 చెప్పేడు. నీతో ప్రేమ వొక తియ్యని జ్ఞాపకమట అతనికి.

ఆ రాత్రి అలా నాకు అతని అసహాయతని చెప్పుకుని, బెస్ట్ విషెస్ అందజేసి ఆ కిషన్ తప్పుకున్నాడు.

అతనెళ్ళేక రాఘవ్ ఈ సంగతి మా నాన్నకి చెప్పేసి పెళ్ళి రద్దుచేయిస్తానన్నాడు.

నేను వాడ్ని వూరుకోమన్నాను.

అందుకు వాడు నేను మతిమాలినవాడ్నని, నీలాంటిదాన్ని చేసుకునే అవసరం లేదని, ఎన్నెన్నో తిట్లుయెన్నో రకాలుగా తిట్టేడు.

అయినా నేనెందుకూ చెలించలేదు.

మానసికంగా ప్రేమించేను కాబట్టి నిన్నొదులుకోలేను—

అందులోనూ సరిగ్గా నాలుగ్గంటలుండగా నేను కాదంటే తర్వాత నీ గతేమాతుందో ఆలోచించలేక పోయేను. అందుకే రాఘవ్‌ని నోరెత్తనీకుండా చేసి పెళ్ళికొడుకునయ్యేను. నీ మెళ్లో తాళీ కట్టేశాను.

సుజీ! మనిషిని బంధించగలంగాని మనసును బంధించలేం కదూ? నాకు— నీకూ మధ్య కిషన్ యెప్పుడూ నా అంతరంగంలో అడ్డుగా వుండేవాడు.

నీతో మాట్లాడుతున్నప్పుడు, నీ కేసి చూసినపుడు, నిన్ను తాకినపుడు యిష్టంలేని పెళ్ళి చేసుకున్నావన్న భావం వీడిపొయ్యేదికాదు.

అలాగని నీతో ముక్తసరిగా (నాకు తెలీకుండా) మాట్లాడే వాడ్నేమో సుజీ!

అర్థంకాని ఈ ప్రేమల ముందు మౌనంగా వుండిపోయే వాడ్నేమో.

ఇప్పుడు- ఇంత తక్కువ సమయంలో—మనిద్దరి ప్రయాణం ముగిసిపోతున్నప్పుడు నన్ను ప్రేమించానని, ఆరాధించాననీ చెప్తున్నావు!

ఈ విషయం యెంత ఆనందాన్నిస్తోందో అంత క్షోభనీ కలుగజేస్తోంది.

మనిద్దర్లాటి ఫూల్స్ ప్రపంచంలో ఇంకెవరైనా వుంటారా? 30 ఏళ్ళు పక్కపక్కనే కూర్చుని ప్రయాణం చేస్తూ మనిద్దరం చివరిదాకా అపరిచితుల్లా వుండిపోయేం. సుజీ! ఇన్ని యేళ్ళు కల్సివున్నప్పుడు నువ్వనొక్కమాట అడిగుంటే యెంత బాగుండేది?

కనీసం నేనైనా- "అతన్ని మర్చిపోయావా?" అని హింసించినా బాగుండేది.

ఇద్దరం రెండు లోకాలుగా బ్రతికేం.

ఎంత వేస్టు? యెన్ని దినాలు?

అవన్నీ వొక్కసారిగా తిరిగొస్తే యెంతో బాగుండునన్పిస్తోంది. ఆశ కదూ? అవేవీ రావిక. ఉన్నదాంతోటే తృప్తి పడాలి—ఈ విషయం ఇంకా బాధిస్తోంది. ఒకరి కోసం వొకరు లోలోపల తపిస్తూ ఇంతకాలం గుడ్డిగా బ్రతికేమనుకుంటే యెంతో షేంపుల్‌గా వుంది. బెటర్ లేట్ దేన్ నెవర్ అనుకుందామా అంటే- మరీ ఇంత లేటా!

అయినా యేం చెయ్యగలం? విధికి, కాలానికి తలవొగ్గాల్సిందేగా సుజీ! నేను వూర్లో గొడవలన్నీ సెటిల్ చేసుకుని రెండు రోజుల్లో తిరిగొచ్చేస్తాను. ఆ తర్వాత ఏ టెలిగ్రామ్ వొచ్చినా వెళ్ళను. నీతోనే వుండిపోతాను. మనవెంట వొక డాక్టర్‌ని ఏర్పాటు చేస్తున్నాను. రాబోయే రోజులన్నీ నీ ఇష్టమైన ప్రదేశాలలో తిరుగుదాం - మౌనంతో కాదుసుమా! ఎన్నోయుగాలకు సరిపోయే మాటలన్నీ నేను యేరి యేరి మాలగా కూరుస్తున్నాను మనసులో. తిరిగొచ్చి నీ హృదయం మీద దాన్ని పరుస్తాను. ఏం? నువ్వు విసుగొచ్చిందన్నా, నోరు మూసుకోమన్నా చెలించను. తెల్సిందా? నీ రెడీ! నే నొచ్చే దాకా మందులన్నీ జాగ్రత్తగా వేసుకో. నువ్వింకా చాన్నాళ్ళు బ్రతికే ప్రయత్నం చెయ్యి- నా కోసం. సరేనా?

ఇవన్నీ డైరెక్ట్‌గా చెప్పాలనుకున్నా (కోప్పడకు). చెప్పి మళ్ళీ విడిచి పోవాలంటే కుదరదుగా, అందుకే ఈ ఉత్తరం.

ఉంటాను మరి— ఎదురుచూస్తావుగా?

అందాకా

మూర్తి.